# దొంగలు

ఇంద్ర భవన్ ! అది స్వర్గంలో లేకపోయినా, దేవతలు, అప్సరసలు వగైరాలు వుండక పోయినా, దాని యజమాని ఇంద్రుడు కాకపోయినా. దాని పేరు ఇంద్రభవనే ! ! కాదనడానికి ఎవరికీ గుండెల్లేవ్. కాని పేరుకు తగ్గట్టుగా లేదు ఆ హోటల్ — అని అనడానికి అందరికీ గుండె వుంటుంది. ఆ మాట కొస్తే మనుషుల్లో పేరుకు తగ్గట్టు, ఎందరుంటారు ?

వై. యం. సి. ఎ. సెంటర్లో వున్న ఇంద్రభవన్ ఎదురుగా కేఫ్ కాస్మోస్ వుండడం. అందులో హై. ఫి. వుండడం. కేఫీ వాడు సరికొత్త హిందీ పాటలు ఎప్పుడూ మ్రోగిస్తూ వుండడం, పరోక్షంగా ఇంద్రభవన్‌కు దెబ్బ. ఆ కేఫ్ ప్రభావం నుంచి తప్పించి, ఎలా జనాన్ని ఆకర్షించాలి ? హోటల్ నెలా వృద్ధిచేసుకోవాలి ? అని చాలా సీరియస్‌గా ఆలోచిస్తుంటాడు హోటల్ యజమాని. ఈ ఆలోచన పదేళ్లుగా చేస్తూచేస్తూ బట్టతల చేసుకున్నాడు. హోటల్‌కు కేఫేకు మధ్యన విశాలంగా రోడ్డు - రోడ్డు మీద నగరానికి, నాగరికతకు సంకేతంగా వాహనాల రొద ....

ఘీంకరిస్తూ, ఏనుగులా పరుగెడుతున్న 'డబుల్‌డెక్' లోంచి కేఫ్‌ముందు దూకేశాడు జాన్, కొంచెం సంబాళించుకుని, నిలబడ్డాక, పూల శర్టును మింగేసిన గళ్ళప్యాంట్‌ను నడుంవద్ద సరిచేసుకుంటూ, ఎదురుగా హోటల్ లోకి - యిటు కేఫ్‌లోకి నల్లకళ్ళద్దాల్లోంచి పరిశీలనగా చూసి, ఆ తరువాత కేఫ్ గడియారం లోకి చూసి, "ఏడున్నరయినా గాని పెంటిగాడింక రాలేదేంది ?" — అనుకుని, కేఫే ప్రక్కనే వున్న కిళ్ళీకొట్టు దగ్గరికి, "ఒక చార్‌మినార్ సిగ్రెటీయన్న" అంటూ వెళ్ళి కొనుక్కుని అంటించుకుని నాలుగైదు దమ్ములు పీల్చేసరికి....చిరునవ్వు దానంతట అదే వచ్చింది. పరిస్థితులన్నీ అనుకూలంగా కనిపించాయి.... కేఫ్ ముందు ఒక్క మంచిసైకిల్ అయినాలేదు. 'థూ'ఉమ్మేశాడు జాన్. హోటల్‌ముందున్న సైకిళ్ళలో ఒకటి అట్లాస్, ఓరెండునార్టన్, తాళం కూడా వేసిలేని మరో కొత్తఫిలిప్స్....అలస్యం చేయొద్దు అనుకుని, హుషారుగా రోడ్ క్రాస్‌చేశాడు జాన్. హోటల్‌ముందు ఓ నిముషంసేపు నిలబడి సిగరెట్‌పొగ ఆదోలా విడిచినింపాదిగా ఫిలిప్స్ సైకిల్‌స్టాండ్ తీసి రోడ్డుమీదికి మళ్ళించాడు. చక్రాలు తిరుగుతుంటే ఎండరీమ్‌లపై పడిమెరుస్తుంది. నింపాదిగా సైకిల్నోసారి చూసి, తృప్తిగా నవ్వుకుని, ఎక్కబోయేసరికి వెనకనుండి "చోర్....సైకిల్ చోర్—పక్‌డో—" ఒకతను వేగంగా పరిగెత్తుకొస్తున్నాడు. జాన్‌కుగాబరా ఎక్కువైంది. అటుయిటూ ఆందోళనగాచూసాడు పరిగెడదామనుకునేంతలోనే వెనకనుంచి చేయిపడింది. జాన్ సైకిల్ విడిచేశాడు. 'ధన్'మనిశబ్దంచేస్తూ పడిపోయిందది. "సైకిలెత్తుకపోతావుర నువ్"-ఓచేతిలో కూరగాయల సంచి, మరో చేత్తోజాన్‌పూలశర్టూ నలిపేస్తున్నాడు, పట్టుకున్న ముసలాడు.

మంది ఎక్కువయ్యే సూచనలు కనిపించగానే, పట్టుకున్న వ్యక్తితో పెనుగులాడాడు వీపుమీదరెండు తగల్నిచ్చాడు-జాన్.

ఆ దృశ్యం అందరూ చూస్తూనే వున్నారు. కాని కొందరుమాత్రం విడిపించడానికి వస్తున్నారు. అక్కడేసెంటర్లో మరోవైపువున్న పోలీస్‌స్టేషన్ కిటికీ లోంచి, లోపల సబ్‌ఇన్‌స్పెక్టర్ గుర్రుపెడుతూ నిద్రపోయినట్టు కనిపిస్తోంది. చెత్తకుండిలోది ఏమేం తిన్నదో అరగడానికి ఓపంది బయటికిటికీ క్రింది గోడకు వళ్ళురాచుకుంటోంది.

పోలీస్టేషన్ ఎదురుగా మర్రిచెట్టు క్రింద, అరుగుమీద టోపీచేతిలో పట్టుకుని నెత్తి-గోక్కుంటూ ఒకడు, పళ్ళన్నీ బయటపెట్టి మరొకడు - కాన్‌స్టేబుల్స్ వున్నారు.

"ఇంకెందరి సైకిళ్ళు కొట్కపోతవ్‌బే నిన్ను పోలీస్‌కిస్త"-అంటూ ఏడుస్తున్నట్టు గర్జిస్తున్నాడు, జాన్‌ను పట్టుకున్న బక్కపల్చటి మనిషి. కొట్లాడే సత్తువ లేదు. అందుకే జాన్‌తో సహా రోడ్డుమీదపడి సైకిల్‌ను పట్టుకున్నాడు. అతను లేవకముందే అతనిజేబులు సర్దిపర్స్‌తీసుకుని జాన్ పరిగెత్తబోయేసరికి, చోర్ ... చోర్—అని కేకలేస్తున్నాడు లేవలేక ఆ ముసలాడు. అప్పటికే ఒకరిద్దరెవరో రిక్షావాళ్ళు జాన్‌నుపట్టుకోడానికి ప్రయత్నించారు, "నడ్మమీకెందుకుబే"-అంటూ బలంగా డొక్కల్లోపొడ్చేసి, అప్పుడే సెంటర్ తిరుగుతున్న బస్సును పరిగెత్తి అందుకున్నాడు - జాన్.

మూగినవాళ్ళలో ఓయిద్దరు ముసలాణ్ణి లేపారు. సైకిల్‌ను నిలబెట్టారు. అప్పటికే సంచిలోంచి రోడ్డుమీదపడ్డ కూరగాయలు రిక్షాల, బస్సుల చక్రాలక్రింద పడి నలిగిపోయ్యాయి. లేచి, కుంటుతూ నడుస్తున్న ముసలాడికాలినుండి రక్తం కారుతోంది. ఏడ్పుగొంతుతో గొణుక్కుంటూ కూరగాయ లేరుకుంటున్నాడు. జేబు మళ్లీమళ్ళీ చూసుకుంటూ తిడుతున్నాడు.

హోటల్‌నుండి ఆలస్యంగా బయటికివచ్చిన వాళ్లల్లో ఒకతనికి ఆదుర్దా ఎక్కువైంది. సైకిల్‌ను పరీక్షించి చూస్తూ—

"ఇది....నా సైకిల్ - ఏమిటి? .... ఏమైంది?"-అని అడిగాడు దిక్కులు పరిశీలిస్తూ ప్రేక్షకుల ముఖాలుచదువుతూ—

"ఇంకేమయితది? నాది నసీబు బాగలేదు పొద్దాల ఏవ్వలిముకం సూశిన్నో సావదెబ్బల్దిన్న....పైసలబ్బాయే''

"నీ పైసలా? - ఎలా పొయ్యాయ్"

"ఆడొకడున్నడు. అన్కపన్లేదు పాటలేదు. సైకిల్లెత్కపోతడు అన్నిదివరకు సూశిన, అండ్కెగి సైకిల్‌దీస్తాంటె. ఇదేదోదొంగపనే వుందనినను

కున్న, గంతె - నన్ను బగ్గదన్ని, సైకిలిడిసి, నాపర్సు కొట్కపోయిండా బాడ్కావ్, అండ్ల పది హేన్రూపాయలుండె .... అడునన్నుదోస్కపోయిండు. ఆ నమ్మకదుప్పగాల, పూటకులేనోన్ని నన్ను దోస్కుంటే మొస్తది? మొన్ననే జీతమెత్తితి. మల్లపైలి ఇయ్యాల్లోస్తదా? రేపొస్తదా? యిర్వయిరోజులెల్లాన్నాయె. "-దీనంగా ఏడుస్తున్నట్టు చెబుతున్నాడు ఆముసలాడు. అవునన్నట్లు హోటల్ ముందు వాళ్ళంకరూ తలలూపుతున్నారు. ముసలాడు. నడుమంతా వత్తుకుంటు న్నాడు. ఆయాసపడ్తున్నాడు. నెత్తికొట్టుకుంటున్నాడు. మంచి చేయబోతే కీడు కలిగిందే-అని అందరూ విచారిస్తున్నారు,

లోతుకళ్ళు, వాటినిండా నీళ్ళు, గొంతులో పదిరకాల జీరలు: ;నెత్తిమీద వెంట్రుకలు నిలబడినా కొన్ని తెల్లబడివున్నాయ్. ముడతలుపడ్డ చొక్కా చేతుల్లోంచి సన్నగా జారినచేతులూ, పైకికట్టిన గళ్లలుంగీలోంచి పొడుచుకొచ్చి, వణుకుతున్న బలహీనమైన కాళ్లూ....సైకిల్ ఓనరుకు జాలికలిగింది.

"యిదిగో పదిరూపాయలు తీసుకో-నువ్వన్నట్లు పదిహేనిచ్చేవాణ్ణే, కాని ఇప్పుడు జేబులోలేవు...."

"ఆఁ .... రూపాయలా? - నువ్వెందుకిస్తవ్ సాబ్. ఆ దెవడో కొట్క పోయిండు."—చెయ్యి చాపుతూనే అన్నాడు,

నా సైకిల్ వల్లకదా నీపర్సుపోయింది. పరవాలేదు, తీస్కో" వణుకుతూ ఇచ్చాడు.

వణికేచేయితో తీసుకున్నాడు - నమస్తె పెట్టాడు.

రోడ్డుమీద లాఠీతో కొట్టుకుంటూ, పోలీసువాళ్లొచ్చారు.

"క్యాబై క్యాహోరైఁ—ఆఁ—" గదమాయించాడు ఒకడు. ముఖం చిట్లించుకుని, సైకిలతను వెళ్ళిపొయ్యాడు.

"దొంగల్వద్దంక అర్నెల్లకు కుక్కల్మొరిగినట్టు. గిప్పు దొస్తాండ్రు సూడు" - కాలి రక్తం తుడుచుకుంటూ అన్నాడు ముసలాయన .... కొందరికి జోక్‌లాగ అనిపించిందేమో నవ్వారు. కొందరు వాళ్లను చులకనగా చూసారు. పోలీసులకు చిర్రెత్తుకొచ్చింది.

"ఏంది? ఏమైతాందీడ"—గద్దించాడు మరొకపోలీస్.

"అయ్యేదేంది, గోర్నమెంటుకూసోవెట్టి, మీకు బొడ్డెల్వెట్టి, మేపుతాంది." ఉక్రోషమంతా ముసలాడి మాటల్లో కక్కుకున్నాడు. వాళ్లమోహం చూడ కుండానే అక్కడ్నించి కదిలాడు.

"క్యాబేదమాక్ ఫిరైక్యా? సీదాబాత్ కర్ ..." అంటూ కర్ర మీదికెత్తి గాండ్రించాడు పోలీసతను.

"ష్షష్ .. ష్షష్.... ఓఓయి .. ఆయన్నే మనక్...." అన్నిదిక్కుల్నుంచి వారింపులు వినవచ్చాయి ఈ దేడ్‌దమాడ్‌గాల్లకు మంచోడెవడో చెడ్డోడెవడో తెల్వదు"-ఎవరో అన్నారు, అసలుసంగతి అర్థంకాక. ఒకరిముఖం ఒకరు చూసు కున్నారు పోలీసోళ్ళు. పరాభవించబడినందుకు ఒకడు పుట్‌పాత్‌ను గట్టిగా కొట్టాడు. మరొకడు టోపీతీసి నెత్తిగోక్కున్నాడు. ఒక్కొక్కరే విడిపోవడం మొదలుపెట్టారు,

"ఎహే-అబ్ ఆయాపైసలాకర్‌నేకు .... థూ . .."అని వుమ్మేసి, నవ్వి వెళ్ళిపోయాడు ముసలాడు. విషయమేమిటో తెల్సుకుందామని - హోటల్ ఓనరు దగ్గరికివెళ్ళారు పోలీసువాళ్ళు.

* * *

"చీచ్ .... చిచిచ్ .... ఓరి పెంటిగా" కేక, చప్పట్లు, వినిపించి చుట్టూ చూసాడు ముసలాడు. నారాయణగూడ బ్రిడ్జిగోడమీద కూర్చునివున్నాడు జాన్ ఈసారి అతన్ని చూడగానే. 'చోర్.... చోర్' .... అనలేదు. స్నేహితుణ్ని చూసిన సంతోషంకలిగింది. వళ్ళు పులకరించింది. అవసరం వున్నప్పుడల్లా రక్తం కారడానికి, మానిపోనివ్వకుండా కాపాడుతున్న కాలిపుండుకు, కటినగుడ్డ జారిపోతే, సరిచేసుకుని మరింత ఓగించాడు. రోడ్ క్రాస్ చేస్తూ, అతని వైపు వడి వడిగా అడుగులేసాడు - ముసలాడు

"హోటల్ ముందు పడ్డప్పుడు లేపేటందొచ్చిన యిద్దట్ల. సూస్తే - ఒకన్దెగ్గర్నే పర్సు దొరికింది. ఇంకోని దగ్గర పర్సేలేదు. " అనుకుంటూ నవ్వు కున్నాడు - ముసలాడు.

వస్తున్న ముసలివాణ్ణి చూసి, సంతృప్తితో 'గింతనేపాటే' - అంటూ వాడి జేబులోంచి, ఇంద్రభవన్ ముందు తీసిన ఖాళీ పర్సు వెనక జేబు లోంచి తీసి యివ్వడానికి సిద్ధంగా పట్టుకున్నాడు - జాన్.

"సికింద్రాబాద్ అల్పా ఓటల్ కాడిక్కి పోదాంపారా" అని అందామని అనుకుంటూ కౌగలించుకున్నంత పని చేసాడు ముసలి పెంటిగాడు.

1975.

—